AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## అదుపు తప్పిన స్కూల్ వ్యాన్..




**అక్షరటుడే, ఎల్లారెడ్డి** : స్కూల్ వ్యాన్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటన బోధన్ పట్టణ శివారులో గురువారం చోటు చేసుకుంది. బోధన్ పట్టణానికి చెందిన సాయి ప్రసన్న స్కూల్ వ్యాన్ సాయంత్రం వేళ విద్యార్థులను ఎక్కించుకుని బయలుదేరింది. ఈక్రమంలో పట్టణ శివారులోని చిక్కి చెరువు వద్ద అదుపుతప్పి పక్కనున్న కాలువకు దూసుకెళ్లింది. అయితే ఈ సంఘటనలో వ్యాన్‌లో ఉన్న విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



## ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేసిన వైద్యాధికారి



**అక్షరటుడే, బోధన్** : పట్టణంలో అనుమతులు లేకుండా ఓ ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. బోధన్ పట్టణంలో కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి క్లినిక్ నిర్వహిస్తూ వైద్యం చేస్తున్నాడు. ఎటువంటి అర్హత లేకపోయినా వైద్యం చేస్తున్నాడని పలువురు ఫిర్యాదులు చేయడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమంత కలిసి పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు. అనంతరం క్లినిక్‌ను సీజ్ చేశారు. ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో చికిత్సలు పొంది ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అధికారులు పేర్కొన్నారు. తనిఖీల్లో బోధన్ ఎస్‌హెచ్‌వో వెంకట్ నారాయణతో పాటు డాక్టర్ శేఖర్, రవి, నిర్మల పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి



**భీమ్‌గల్, అక్షరటుడే:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న తనిఖీ చేశారు. కళాశాలలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు, ఇతర ప్రయోగశాలల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటిస్తూ.. భౌతిక శాస్త్రానికి సంబంధించిన ఆన్‌లైన్ తరగతుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సోషల్ మీడియా వేదికగా ఆఫర్ల పేరిట ఫేక్ లింక్స్ పంపి కొత్తరకం మోసాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు. సైబర్ వలలో చిక్కుకుని చదువుకున్న యువత, ఉద్యోగులే అధిక సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. ఇళ్లలో చోరీల కంటే ఆన్‌లైన్ చోరీలతోనే ప్రజలు అధిక మొత్తంలో నష్టపోతున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి



జిల్లాలో సైబర్ బాధితులు పెరిగిపోతున్నారు. సైబర్ నేరాల కట్టడికి పోలీసు శాఖ ఎన్ని చర్యలు చేపడుతున్నా ప్రజల నుంచి మద్దతు కరువవుతుందని తెలుస్తోంది. పోలీసుల సూచనలను పట్టించుకోకుండా ఈజీ మనీ కోసం ఆరటపడుతూ ఖాతాలు ఖాళీ చేసుకుంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు మోసపోయిన తర్వాత న్యాయం చేయాలని పోలీసుల చెంతకు చేరుతున్నారు.

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- ఉద్యోగులు, యువకులే బాధితులు
- గతేడాది రూ.6 కోట్లు కాజేత
- సకాలంలో ఫిర్యాదు చేయని వైనం

సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా వేదికగా ఫేక్ లింక్స్ షేర్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. అయితే చదువుకున్న యువత, అన్నీ తెలిసిన ఉద్యోగులే ఎక్కువ సంఖ్యలో సైబర్ మోసాలకు గురవుతుండడం గమనార్హం. బయట ఖర్చుల కోసం యువత, ఇంకా ఎక్కువ డబ్బు సంపాదించాలన్న ఆశతో ఉద్యోగులు ఈజీ మనీ కోసం ఆరాట పడుతున్నారు. మొదట్లో ఫేక్ లింక్స్ ద్వారా ఖాతాలో నగదు జమ చేస్తున్న సైబర్ నేరగాళ్లు తర్వాత నమ్మించి ఖాతాలోంచి నగదు కొల్లగొడుతున్నారు.

### సైబర్ మోసం రూ.6 కోట్లు

జిల్లాలో 2024 సంవత్సరంలో 200లకు పైగా సైబర్ మోసాలు జరిగాయి. 2025లో ఈ సంఖ్య 160కి తగ్గింది. పోలీసుల అవగాహన చర్యలతో సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇళ్లలో దోపిడీ, చోరీల ఘటనలతో ప్రజలు 2025లో రూ.కోటిన్నర వరకు పోగొట్టుకోగా సైబర్ నేరాల ద్వారా రూ.6 కోట్లు పోగొట్టుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆన్‌లైన్ మోసాల బారిన పడ్డ వారిలో పలువురు తమ పరువు పోతుందని బయటకు చెప్పుకోవడం లేదు.

### ఫిర్యాదులతో రూ.90 లక్షలు ఫ్రీజ్

సైబర్ మోసాలకు గురైన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే చాలా మంది సకాలంలో ఫిర్యాదు చేయడం లేదు. దీంతో రికవరీ చేయడం సాధ్యం కావడం లేదు. మోసం జరిగిన గంటను గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో వెంటనే ఫిర్యాదు చేయడం వల్ల మొత్తం డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుంది. అయితే చాలా మంది తాము మోసపోయామని ఆలస్యంగా గ్రహిస్తున్నారు. అనంతరం పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సైబర్ మోసాలకు సంబంధించి జిల్లాలో రూ.90 లక్షల నగదును పోలీసులు ఫ్రీజ్ చేయించారు. ఇందులో రూ.15 లక్షలు మాత్రమే బాధితుల ఖాతాల్లో జమ చేయించగలిగారు. మరికొంత నగదు బాధితుల ఖాతాల్లో జమ చేయించేలా పోలీసులు కృషి చేస్తున్నారు.

### ప్రత్యేక దృష్టి పెడతాం



ఆన్‌లైన్ బెట్టింగ్, ఫేక్ లింక్స్ ద్వారా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సైబర్ మోసాలకు యువత, ఉద్యోగులు బలవుతున్నారు. అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసే సమావేశానికి అందరూ వచ్చే అవకాశం లేదు. దీంతో ఫొటోలు, వీడియోలు తయారు చేసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తాం. సైబర్ నేరాల అడ్డుకట్టకు ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– రాజేష్ చంద్ర, కామారెడ్డి ఎస్పీ



## ప్రజల మద్దతు ఉన్న వారికే పార్టీ టికెట్..

**అక్షరటుడే, ఆర్మూర్** : కాంగ్రెస్ పార్టీ సర్వేలో ప్రజల మద్దతు ఉన్నవారికే మున్సిపల్ ఎన్నికల్లో బీ ఫాం ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ పెద్దలు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికలపై నిజామాబాద్ పార్లమెంటరీ స్థాయి సమావేశాన్ని గురువారం పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో నిర్వహించారు. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ కాంగ్రెస్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మున్సిపల్ ఎన్నికలపై ఆర్మూర్ ప్రాంత నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి, నిజామాబాద్ జిల్లా మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఖనిజాభివృద్ధి సంస్థ రాష్ట్ర ఛైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, రుయ్యాడి రాజేశ్వర్, ఏబీ చిన్న (శ్రీనివాస్), ఆర్మూర్ ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబాగౌడ్, ఖాందేశ్ శ్రీనివాస్, సంజయ్ సింగ్ బబ్లు, పండిత్ పవన్, మారుతి రెడ్డి పాల్గొన్నారు.

## కేజీబీవీని సందర్శించిన కలెక్టర్




**అక్షరటుడే, ఇందూరు** : జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్‌లోని నిజామాబాద్ నార్త్ మండల కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి ఆయా సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, విద్యార్థినుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. కలెక్టర్ స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి, తెలుగు, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులలో పలు అంశాలను బోర్డుపై రాసి బాలికలకు బోధించారు. వెంట తెచ్చిన చాక్లెట్లు, బిస్కెట్లను విద్యార్థినులకు అందించారు. భోజన విరామ సమయంలో పలువురు బాలికలు చెస్ ఆడుతుండడాన్ని గమనించిన కలెక్టర్ కూడా వారితో కలిసి నేలపై కూర్చుండి చెస్ ఆడారు. విద్యార్థినులు తమ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్ తదితరులున్నారు.

## ఎల్లారెడ్డిలో అభివృద్ధి పరుగులు




**అక్షరటుడే, ఎల్లారెడ్డి** : పట్టణంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు ఆయా వార్డుల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పనులను ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. వాడల్లో జరుగుతున్న పనులు నాణ్యతగా చేపట్టాలని.. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు గుత్తేదారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రతివార్డులో సమస్యల పరిష్కారానికి నిధులిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా బస్‌స్టాండ్ అభివృద్ధి, మినీ ట్యాంక్ బండ్, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధిదీపాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు పట్టణంలో కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. వెనుకబడి ఉన్న ఎల్లారెడ్డిని విద్య, వైద్యం పర్యాటక రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేపించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## ఇందూరుపై కాషాయ జెండా ఎగురవేస్తాం: ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** మున్సిపల్ ఎన్నికల్లో ఇందూరు నగరపాలక సంస్థపై కాషాయ జెండా రెపరెపలాడుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం పలు కాలనీల్లోని అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత దేశం తిరుగులేని శక్తిగా ఎదుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో కేవలం రెండు సీట్ల తేడాతో మేయర్ పీఠాన్ని కోల్పోయామని ఈ ఎన్నికల్లో కచ్చితంగా కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.



## నామినేషన్ సెంటర్ల పరిశీలన

**అక్షరటుడే, బోధన్** : రానున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంట్లో భాగంగా గురువారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేయనున్న నామినేషన్ సెంటర్లను జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. బోధన్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలను ఆయన పరిశీలన చేశారు. నామినేషన్ సందర్భంగా ఎటువంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ యాదవ్ కృష్ణ తదితరులున్నారు.

## మంచి నాయకులను ఎన్నుకుంటే అభివృద్ధి సాధ్యం: పోచారం

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంలోని 19, 5వ వార్డుల్లో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వార్డుల ప్రజలతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో తమ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో బాధ్యతతో పనిచేసే ప్రతినిధులను ఎన్నుకుంటే వార్డులు మరింత అభివృద్ధి సాధిస్తాయని తెలిపారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన తర్వాత బాన్సువాడ పట్టణంలో సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని వెల్లడించారు. అనంతరం బీర్కూర్ మండలం మిర్జాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని అన్నారం గ్రామంలో రూ.23 లక్షలతో నిర్మించిన 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగి భవనాన్ని పోచారం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.



## రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేకుండా చేస్తున్న సీఎం: మాజీ ఎమ్మెల్యేలు

**అక్షరటుడే, కామారెడ్డి:** సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడే మాటలు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేకుండా చేస్తున్నాయని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా ప్రజా ప్రభుత్వం పేరుతో అరాచకాలు సృష్టిస్తూ సమాజాన్ని విడదీసే విధంగా సీఎం మాటలు ఉన్నాయన్నారు. ఖమ్మం సభలో మాట్లాడుతూ రాష్ట్రం మొత్తంలో బీఆర్ఎస్ పార్టీ గద్దెలను కూల్చాలని మాట్లాడడం చూస్తే సీఎం ఎంత అసహనంతో ఉన్నారో అర్థం అవుతుందన్నారు. బీఆర్ఎస్‌పై మాట్లాడే అర్హత సీఎంకు ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన గొప్ప పోరాట యోధుడు, రాష్ట్ర మొదటి సీఎం కేసీఆర్ మీద రెండేళ్లుగా నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారన్నారు. ప్రజలకు ప్రజాపాలన ప్రభుత్వమని చెబుతూ ప్రజా వ్యతిరేక పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రజల దృష్టి మళ్లించేందుకే..

ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి దృష్టి మళ్లించేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు. దేశంలోనే నంబర్-1 రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన నేత కేసీఆర్ అని.. కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్రలో నిలిచే వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వ్యక్తిని మాటలు అంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజలకు సుపరిపాలన కోసం జిల్లాలు ఏర్పాటు చేసుకున్నామని, రెండేళ్లలో జిల్లాకు ఒక్క రూపాయి అయినా ఖర్చు చేశారా అని ప్రశ్నించారు. షబ్బీర్ అలీకి కామారెడ్డి అభివృద్ధి ఇవాళ గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. నాటి సీఎం జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేస్తే నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.



## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమ్‌గల్ ఏఎస్సై అబ్దుల్ సత్తార్ హాజరై విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన ప్రయాణ అలవాట్లను పెంపొందించుకోవాలని, తమ కుటుంబ సభ్యులకు కూడా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# క్రీడలతో నాయకత్వ లక్షణాలు: ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఆర్మూర్/కమ్మర్‌పల్లి :** క్రీడలతో మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఇండోర్ మైదానంలో జరుగుతున్న 69వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ అండర్-17 (బాలబాలికల) పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల నిర్వహణలో ఎవరూ వెనకడుగు వేయవద్దని, తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కమ్మర్‌పల్లి లేదా వేల్పూర్ వేదికగా రాష్ట్రస్థాయి ఈవెంట్‌ను నిర్వహించాలన్న ప్రతిపాదనకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఎక్కడ వీలైతే అక్కడ పెద్దఎత్తున టోర్నమెంట్లు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోని మరే నియోజకవర్గంలో లేనివిధంగా బాల్కొండ నియోజకవర్గంలో రెండు ఇండోర్ స్టేడియంలు కమ్మర్‌పల్లి, వేల్పూర్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఈ మౌలిక సదుపాయాలను కల్పించుకున్నామని, వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తన తండ్రి, స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి గొప్ప క్రీడాకారుడని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆయన జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారుడని, సీనియర్ నేషనల్స్ ఆడారని, అలాగే క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి అన్ని క్రీడలలో రాణించారని తెలిపారు. విద్యాసాగర్ సూచించినట్లుగా, భవిష్యత్తులో సురేందర్ రెడ్డి మీద రాష్ట్రస్థాయి టోర్నమెంట్ నిర్వహించడానికి అసోసియేషన్ అధికారులు చొరవ తీసుకుంటే, దానికి తన పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్, క్రీడా సంఘం బాధ్యులు సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ శోభన్, నిజామాబాద్ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, పీఈటీలు విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, నీరజ రెడ్డి, ఎంఈవో ఆంధ్రయ్య, తహశీల్దార్ సాయన్న, ఎంపీడీవో ప్రసాద్, రాష్ట్రస్థాయి పరిశీలకులు, సెలెక్టర్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## మెండోరాలో సీఎం కప్ ప్రారంభం

**అక్షరటుడే,మెండోరా:** పోచంపాడ్ జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో గురువారం సీఎంకప్ పోటీలను సర్పంచ్ మాధురి రాజు ప్రారంభించారు. ఆయన ఆమె మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మమత, పీఆర్‌టీయూ ప్రతినిధి సురేందర్, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం :** జిల్లాలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ సీనియర్ న్యాయవాది జయకుమార్ అన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ నిమిత్తం జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా గురువారం జిల్లా కోర్టులో ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ సభ్యులను కలుస్తూ తనకు తెలంగాణ బార్ కౌన్సిల్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎన్నుకోవాలని కోరారు. అడ్వకేట్ల సమస్యలను పరిష్కరించడంలో తన వంతు పాత్రను పోషిస్తానని ఈ సందర్భంగా జయకుమార్ హామీ ఇచ్చారు.

## శ్రీరాంపూర్‌లో 'జల్ సేవా ఆంకలన్' గ్రామసభ



**అక్షరటుడే బాల్కొండ:** మండలంలోని శ్రీరాంపూర్ గ్రామంలో 'జల్ సేవా ఆంకలన్' కార్యక్రమంలో భాగంగా గ్రామసభను నిర్వహించారు. ఈ సభకు సర్పంచ్ నల్గొండ పద్మ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో గ్రామ జల-పరిశుభ్రత కమిటీ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా, పరిశుభ్రత అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎంపీవో గంగా మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వెంకటేష్, ఉప సర్పంచ్ పెద్ది విలాస్, పంచాయతీ కార్యదర్శి గణేష్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్, ఎఫ్‌ఏ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రేపు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్–టీచర్స్ మీటింగ్


**అక్షరటుడే గాంధారి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం తెలిపారు. తెలంగాణ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో భాగంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## తెలుగు కవుల వర్ణ చిత్ర పటాల ఆవిష్కరణ

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ఉప్లూర్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా కవుల వర్ణచిత్రపటాలు, కవి చరిత్ర కార్డులను హెచ్‌ఎం రాజన్న ఆవిష్కరించి పిల్లలందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవన్న, కిషన్, మహి కాంత్, రవీందర్, శ్రీనివాస్, రంగాచార్య, గోపాల్, చంద్రకళ, శ్రావణి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## పంచాయతీ స్థలాలను కాపాడడం ప్రతిఒక్కరి బాధ్యత



**అక్షరటుడే, ఆర్మూర్:** పంచాయతీ స్థలాలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ గంగోళ్ల సుష్మిత ప్రళయ్ తేజ్ అన్నారు. ఆలూరు మండలం కల్లెడిలో పంచాయతీకి చెందిన స్థలాలను కొందరు కబ్జా చేస్తున్నారని స్థానిక ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు వాటిని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సర్వే చేయించి సంబంధిత స్థలం పంచాయతీదేనని నిర్ధారించి కబ్జాలో ఉన్న వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని ఆయన పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ శివారులోని కొచ్చెర మైసమ్మ ఆలయంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 16 అర్ధరాత్రి దొంగలు గుడి తాళాలు పగులగొట్టి అమ్మవారి వెండి కళ్లను దొంగిలించిన ఘటనపై గుడి సూపర్‌వైజర్ గడ్డం సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతంలో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న జోడు మల్లయ్యను పట్టుకొని విచారించగా కొచ్చెర మైసమ్మ ఆలయంలో హుండీలు పగులగొట్టి డబ్బులు దొరకకపోవడంతో గర్భగుడి తాళాలు పగులగొట్టి అమ్మవారి రెండు వెండి కళ్లను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిపై గతంలో మెదక్, రామాయంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహన దొంగతనం కేసులు నమోదయ్యాయని, అలాగే నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మేకల దొంగతనం ప్రయత్నం కేసులో జైలుకు కూడా వెళ్లినట్లు తెలిపారు. కేసును చేధించిన ఎస్సై రాఘవేంద్ర, సిబ్బంది మహేష్‌ను ఎస్పీ అభినందించారు.

## అనుమానాస్పద స్థితిలో నవజాత శిశువు మృతి

**అక్షరటుడే, కామారెడ్డి :** అనుమానాస్పద స్థితిలో నవజాత శిశువు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన ఒగ్గు గంగాజమున పురిటి నొప్పులతో ఈనెల 19న ఆస్పత్రిలో చేరింది. 20న ఉదయం ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే పుట్టిన బిడ్డ బరువు తక్కువ ఉండడంతో పిల్లల వార్డులో చేర్చారు. బుధవారం బిడ్డను తల్లికి అప్పగించారు. అయితే గురువారం బిడ్డలో చలనం లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దాంతో ప్రభుత్వ ఆస్పత్రిలో పిల్లల వైద్యులు సరిగ్గా పట్టించుకోకపోవడంతోనే బిడ్డ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆస్పత్రి వైద్యుల వాదన మరోలా ఉంది. పసి బిడ్డను తల్లి వద్ద ఉంచాల్సిన బంధువులు వాళ్లు పడుకున్న చోటే ఉంచడంతో రాత్రి పూట బిడ్డపై కాలు లేదా చేయి వేసి ఉండవచ్చని, అందుకే బాబు చనిపోయి ఉంటాడని తెలిపారు. అలాగే ఆస్పత్రి నుంచి తమకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారని, ప్రైవేట్ ఆస్పత్రిలోనే బాబు మృతి చెంది ఉంటాడనే అనుమానం కూడా వ్యక్తం చేశారు. దాంతో నవజాత శిశువు మృతికి కారణాలు ఏమిటనేది స్పష్టంగా తెలియరాలేదు.

## బాసర ఆలయానికి పాదయాత్ర



**అక్షరటుడే, బాన్సువాడ:** బాసర జ్ఞాన సరస్వతి ఆలయానికి బీర్కూర్ మండల కేంద్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవి మహా పాదయాత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ సారి మహా పాదయాత్ర గురువారం ప్రారంభమైంది. అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో 110 మంది సరస్వతి మాత స్వాములు ఉదయం స్థానిక హనుమాన్ మందిరం నుంచి బాసర వరకు పాదయాత్రగా బయలుదేరారు. హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీర్కూర్ ఉమ్మడి మండలాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ దుర్గం శ్యామల జెండా ఊపి మహా పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మతేజ, ఉప సర్పంచ్ పరమేష్ పంతులు, గుడికొండ లింగం గురుస్వామి, యమ పెద్ద రాములు, బస్వరాజ్ పటేల్, మియాపురం శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా వార్షికోత్సవం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని రామాలయంలో అయోధ్య బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ రెండో వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులతో ప్రత్యేక అభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. రామమందిరం విషయంలో 500 ఏళ్ల హిందువుల కల సాకారమైన ఈ రోజును ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు పూజారులు పేర్కొన్నారు. ప్రతి హిందువు రాముడు చూపిన ధర్మమార్గంలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## పరీక్షల సన్నద్ధతపై అవగాహన



**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఉమ్మడి జిల్లా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఆఫీసర్ దాసరి ఒడ్డెన్న వార్షిక పరీక్షల సన్నద్ధతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా కళాశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల సక్సెస్ స్టోరీలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజిద్దీన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## సారంగాపూర్‌లో అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగర శివారులోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారంగపూర్ సమీపంలో ఉన్న రాయల్ ఫంక్షన్ హాల్ వెనుక ఉన్న నసీరుద్దీన్‌కు చెందిన పాత సామాను షాప్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో షాపులోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న సిబ్బంది స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వెంటనే మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం జరిగినప్పటికీ.. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఆస్తి నష్టంకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆడుకుంటున్న బాలుడిని ఢీకొన్న కారు.. చికిత్స పొందుతూ మృతి

**అక్షరటుడే, భీమ్‌గల్ :** ఆడుకుంటున్న బాలుడిని కారు రూపంలో మృత్యువు కబళించింది. అమ్మమ్మ ఇంటికి ఆనందంగా గడుపుదామని వచ్చిన బాలుడి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వేల్పూర్ మండలం మోతెలో బుధవారం మూడేళ్ల బాలుడిని కారు ఢీకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆర్మూర్ మండలం పెర్కిట్ గ్రామానికి చెందిన దావుల ఎహెన్స్(3) తన తల్లిదండ్రులతో కలిసి మోతే గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. బుధవారం సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో బాలుడు ఇంటి బయట వాకిట్లో ఆడుకుంటున్నాడు. ఓ కారును అజాగ్రత్తగా రివర్స్ తీస్తుండగా.. బాలుడిని ఢీకొంది. బాలుడికి తలకు తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ఆనంద్ ఆసుపత్రి కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఎహెన్స్ మృతి చెందాడు. ఆడుకుంటూ కళ్లముందే తిరుగుతున్న చిన్నారి మృతి చెందడంతో మోతే, పెర్కిట్ గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడి అరెస్టు




**అక్షరటుడే, బోధన్ :** బంగారం దుకాణాల తాళాలు పగలగొట్టి సొత్తును దోచుకున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాలో ఒక సభ్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న బంగారం షాపులో డిసెంబర్ 21న చోరీ జరగగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇంటెలిజెన్స్ సమాచారం, సీసీ ఫుటేజీ ఆధారంగా అంతర్రాష్ట్ర దొంగల ముఠాలో సభ్యుడైన మమ్మద్ మూల సబ్ షేక్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి కిలో వెండి, 5 తులాల బంగారాన్ని రికవరీ చేశామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ వెంకటనారాయణ, టౌన్ ఎస్సై మనోజ్ కుమార్, ఏఎస్సై బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని రాంచంద్రపల్లిలో సర్పంచ్ తొగరి భూషణ్ ఆధ్వర్యంలో ఇందిర మహిళా శక్తి - మహిళా స్వయం సహకార సంఘాల సహకారంతో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి మహిళా సంఘం బలపడితే గ్రామీణాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో రాంచంద్రపల్లి గ్రామ అధ్యక్షుడు సక్కి ప్రభాకర్, మాజీ సర్పంచ్ గంగారాం పాల్గొన్నారు.